www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 22 ఏప్రిల్ 2025
5
చిత్తూరు

ముంచేస్తున్న నాసిరకం మొక్కలు!

• యథేచ్ఛగా అనుమతుల్లేని నర్సరీలు • రైతులకు వేల రూపాయల నష్టం • స్పందించని అధికారులు

ప్రజాశక్తి -గంగవరం: మండల పరిధిలో అను మతులు లేని నర్సరీలు పుట్టగొడుగుల్లా పుట్టు కొస్తున్నాయి. కర్నాటకలోని మంచి బ్రాండెడ్ విత్తనాల పేరుతో నాసిరకం మొక్కలు విక్ర యిస్తూ రైతులను నిలువునా ముంచే స్తున్నాయి. కనీసం లైసెన్సులు కూడా లేని నర్సరీలు మాయమాటలతో నాసిరకం మొక్కలు రైతులకు అంటగట్టి వేల రూపాయల నష్టం కలిగించి రైతుల జీవితాలను అంధకారం చేస్తున్నాయి. నాసిరకం నర్సరీలపై నిఘా వుంచాల్సిన సంబంధిత శాఖ అధికారులు ఏ మాత్రం స్పందించకపోవడంతో తాము తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముంచేస్తున్న నాసిరకం మొక్కలు

గంగవరం పరిదిలోని పుంగనూరు - పలమనేరు రహదారిలో ఒక కిలోమీటరు దూరంలోనే పది నర్సరీలు, ఏడు కిలోమీటర్ల పరిధిలో సుమారు 15 నర్సరీలు వున్నాయి. ఈ నర్సరీలలో గోసు, వంకాయ, మిరప, కాలీఫ్లవర్, బొప్పాయి, టమాటా మొక్కలు విక్రయిస్తున్నారు. వీటిని నర్సరీ నిర్వాహకులు కర్నాటక నుంచి మంచి బ్రాండెడ్ విత్తనాలు తెచ్చి మొక్కలు పెంచి ఇస్తున్నామని నమ్మించి రైతులకు అధిక ధరలకు విక్రయిస్తున్నారని బాధిత రైతులు వాపోతున్నారు. కూరగాయల పంటలు పండించడానికి గతంలో రైతులు తమంతట తాము విత్తనాలతో నార్లు పోసుకొని పక్వానికి వచ్చిన తర్వాత పొలాల్లో రకరకాల కూరగాయల పంటలు పండించేవారు. ప్రస్తుతం ఊరుకో నర్సరీ కావడంతో నర్సరీ నిర్వాహకులు నాసిరకం విత్తనాల తెచ్చి ఆ విత్తనాలకు రకరకాల పేర్లతో మొక్కలు తయారుచేసి రైతులకు విక్రయిస్తున్నారు. వీరికి ఎలాంటి అనుమతులు లేవు. లక్షల రూపాయలు ఆదాయం ఆర్జిస్తున్నా ప్రభుత్వానికి ఎలాంటి రుసుం చెల్లించడంలేదని ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని రైతులువాపోతున్నారు.

యథేచ్ఛగా అనుమతుల్లేని నర్సరీలు

గంగవరం మండల కేంద్రం పరిసర ప్రాంతాల్లో సుమారు 15 నర్సరీలు వున్నాయి. కర్నాటక నుంచి తీసుకొచ్చిన మంచి బ్రాండెడ్ విత్తనాలతో పెంచిన మొక్కలు విక్రయిస్తున్నామని నమ్మిస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఈ నర్సరీలకు లైసెన్సులు కూడా లేవని, గత ప్రభుత్వంలో లైసెన్సులు తీసుకోవాలని హెచ్చరించినా ఖాతరు చేయలేదని రైతులు వాపోతున్నారు. వీటిపై సంబంధిత

నర్సరీలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న టమోటా నారు

శాఖాధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

రైతులకు వేల రూపాయల నష్టం

రైతులు ఒక్కో మొక్క రూపాయి నుండి ఐదు రూపాయల వరకు పెట్టుబడి పెట్టి పొలాల్లో నాటిన తర్వాత వంద మొక్కలకు కనీసం 40 శాతం వరకు చనిపోతున్నాయని, మళ్లీ వాటి స్థానంలో మొక్కలు నాటినా పంట ఒక్కసారిగా రాకపోగా కొన్ని మొక్కలు పూత దశలో కొంత భాగం, పంట పూర్తి దశలో మరి కొంత భాగం కోల్పోయి రకరకాలుగా వేల రూపాయల్లో తీవ్ర నష్టం ఎదుర్కోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం నర్సరీలలో టమాటా, మిరప, వంకాయ, క్యాలీఫ్లవర్, గోసు, బొప్పాయి, తదితర కూరగాయల మొక్కలు పెంచి విక్రయిస్తున్నారని రైతులు పేర్కొన్నారు. ఈ నాసిరకం మొక్కలు నాటి కష్టాలు పాలు కావాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాలీ ఫ్లవర్ మొక్కలు నాటాను..

నేను రెండు ఎకరాలలో కాలీఫ్లవర్ నాటాను. అందులో 40 శాతం మొక్కలు చని పోయాయి. ఆ ప్రాంతం అంతా పిచ్చి మొక్కలతో అల్లుకుపోయింది. ఈ విషయాన్ని నర్సరీ వారిని అడిగితే మీరు వాటికి సక్రమంగా నీరు అందించడం లేదు.. ఎక్కువగా క్రిమి సంహారక మందులు వాడడంతోనే అలా అయిందని బెదిరిస్తున్నారు.. అయితే నాసిరకం విత్తనాలతోనే ఈ సమస్య వచ్చింది..

- వెంకటరమణ, రైతు.

మొక్కలు ఏపుగా పెరగడం లేదు..

మొక్కలు పండిస్తే పంట బాగా రావడంతో పాటు ఎదుగుదల ఉంటుం దని నమ్మి ఈ నర్సరీలపై ఆధారపడి వేల రూపాయలు నష్టపోతున్నాం.. వున్న ఎకరా పొలంలో ప్రస్తుతం సీజన్ కావడంతో నర్సరీ నుండి పదివేల టమాటా మొక్కలు ఒక్కో మొక్క రెండు రూపాయలు చొప్పున కొనుగోలు చేసి నాటాను. అందులో సగానికి సగం మొక్కలు కూడా బతకడం లేదు.. నర్సరీలలో నాసిరకం విత్తనాలతో పెంచిన మొక్కలు అమ్మి రైతులను మోసం చేస్తున్నారు. ప్రస్తుతం నాటిన టమోటా పంట పూత దశలో ఉంది. ఇప్పుడు చిన్న మొక్కలు తెచ్చి నాటినా ప్రయోజనం లేదు..

- గోవర్ధన్, యువరైతు.

సగం మొక్కలు కూడా రాలేదు..

ఎకరా పొలంలో టమోటాతో పాటు కాలీఫ్లవర్ నాటాను. సగం మొక్కలు కూడా మొలకెత్తలేదు. పూర్తిగా నష్టపోతున్నాం.. గత ప్రభుత్వంలో నర్సరీ నిర్వాహకులకు తప్పని సరిగా ప్రభుత్వం నుండి లైసెన్సులు పొంది ఉండాలని ఆదేశాలు జారీ చేశారు..వారు మాత్రం ఎలాంటి అనుమతులు లేకుండా నర్సరీలు నిర్వహించి రైతులను మోసం చేస్తున్నారు.. వ్యవసాయ అధికారులు కానీ, సంబంధిత అధికారులు కానీ ఈ నర్సరీలను తనిఖీ చేసి అందులో విత్తనాల నాణ్యతను పరీక్షించి నాసిరకం విత్తనాలు ఉంటే కఠిన చర్యలు తీసుకోవాలి.

- కృష్ణప్ప, రైతు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్

ప్రజాశక్తి-పలమనేరు: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని, పలమనేరు డివిజన్ పరిధిలో సమస్యల పరిష్కారానికి రానున్న మూడు నెలల పాటు ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమ నిర్వహణ ఉంటుందని కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం పలమనేరు ఆర్‌డిఓ కార్యాలయంలో పలమనేరు రెవెన్యూ డివిజన్ పరిధి లోని ప్రజల సమస్యల పరిష్కారం నిమిత్తం ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు, పలమనేరు శాసన సభ్యులు ఎన్.అమరనాథ్ రెడ్డి, జిల్లా జాయింట్ కలెక్టర్ జి. విద్యాధరి, డిఆర్ఓ కె మోహన్ కుమార్‌లు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుండి అందుతున్న వినతులలో దాదాపు 95 శాతం రెవెన్యూ సమస్యలకు సంబంధించినవే ఉన్నాయన్నారు. ఇందులో డికెటి, కుటుంబ తగాదాలు, ఆర్ఓఆర్, ఆన్‌లైన్ రికార్డులలో సమస్యలు ఉన్నాయని, ఈ సమస్యల పరిష్కారానికి తహశీల్దార్ల కు ఆదేశాలు ఇచ్చారని క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. న్యాయ పరమైన చిక్కులు, కుటుంబ తగాదాల నేపథ్యంలో వినతుల పరిష్కారం ఆలస్యం అవుతోందన్నారు. రానున్న మూడు నెలలు పలమనేరు, పుంగనూరు నియోజకవర్గంలో ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి ముఖ్యంగా భూ సమస్యల పరిష్కారానికి చర్యలు చూపుతామన్నారు. వినతుల పరిష్కారానికి అధికారులకు సరిపడ సమయం ఇస్తున్నామని, నాణ్యమైన పరిష్కారం చూపుతామన్నారు. పలమనేరు, పుంగనూరు నియోజకవర్గాల నుండి జిల్లా కేంద్రంకు వచ్చి సమస్యలను విన్నవించడానికి ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఇదొక సదవకాశమని పేర్కొన్నారు. జిల్లాలలో పిజిఆర్ఎస్ ద్వారా 53 వేల వినతులు అందగా అందులో 12 వేల అర్జీలు కుప్పం నియోజకవర్గం నుండి అందాయని, క్రమంగా కుప్పంలో పర్యటించి సాధ్యమైనంత సమస్యలకు పరిష్కారం చూపామన్నారు. అదే తరహాలో మిగిలిన నియోజకవర్గ పరిధిలో సమస్యల పరిష్కారం పై దృష్టి పెట్టామన్నారు. పలమనేరు ఎంఎల్ఏ అమరనాథరెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమ నిర్వహణ పూర్తిగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచన అని, గతంలో ఆయన ముఖ్యమంత్రి గా ఉన్న సమయంలో కూడా ఇదే విధంగా అధికార యంత్రాంగాన్ని ప్రజల దగ్గరకు పంపి వారి సమస్యలకు పరిష్కార మార్గం చూపేలా చర్యలు తీసుకున్నారన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమంలో ప్రజలను భాగస్వామ్యం చేయాలన్నది ముఖ్యమంత్రి ఉద్దేశ్యం అన్నారు. పలమనేరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని పలమనేరు, పుంగనూరు నియోజక వర్గాలలో ప్రజల సమస్యలను స్వీకరించామన్నారు. పుంగనూరులో గతంలో జమీందారీ వ్యవస్థ ఉండడం, పలమనేరు లో కొన్ని ప్రత్యేక పరిస్థితుల కారణంగా రెవెన్యూ సమస్యలు ఉత్పన్నమయ్యాయని, కలెక్టర్, జాయింట్ కలెక్టర్ల ఆధ్వర్యంలో పార్టీలకు అతీతంగా సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టామన్నారు. పలమనేరు డివిజన్ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్ ఆధ్వర్యంలో పలమనేరు డివిజన్ కేంద్రంలో రానున్న మూడు నెలల పాటు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తామని, ఈ కార్యక్ర మానికి జిల్లా స్థాయి అధికారులు హాజరవుతారన్నారు. ఈ సదవకాశాన్ని పలమనేరు డివిజన్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పిజిఆర్ఎస్‌కు 258 అర్జీలు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా జిల్లా సచివాలయంలోని గ్రీవెన్స్ హాలులో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు అనుపమ, విజయలక్ష్మి, వెంకట శివ, చిత్తూరు ఆర్‌డిఓ శ్రీనివాసులు, ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. మొత్తం 258 అర్జీలు వచ్చాయని అధికారులు తెలిపారు. రెవెన్యూ శాఖ కు 213, పోలీస్ శాఖకు 6, డ్వామా 1, ఆర్ అండ్ బి 1, డిఆర్‌డిఏ 26, డిసిహెచ్ ఎస్ 1, మున్సిపల్ కమిషనర్ నగరి 1, డీఎస్ఓ 4, అనిమల్ హస్బంధ్రీ 2, హౌసింగ్ 3, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులు సమస్యలను డిప్యూటీ కలెక్టర్లకు, ఆర్ డిఓకు అందించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

పలమనేరు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్న కలెక్టర్

పౌష్టికాహారంతోనే రక్తహీనత నివారణ

- జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ వెంకటేశ్వరి

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: పౌష్టికాహారంతోనే గర్భిణులు, బాలింతల్లో రక్తహీనతను నివారించవచ్చని జిల్లా మహిళ శిశు సంక్షేమ శాఖ పీడీ వెంకటేశ్వరి అన్నారు. సోమవారం గంగాధరనెల్లూరు మండలంలోని ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో పౌష్టికాహార పక్షోత్సవాల కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు, బాలింతలకు అవగాహన చేపట్టారు. ఈ సందర్భంగా పీడీ వెంకటేశ్వరి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర, ప్రభుత్వాల నేతృత్వంలో అమలు చేస్తున్న పోషన్ పక్వాడ్ కార్యక్రమంపై గ్రామాల్లో అవగాహన కలిగించి ప్రజల్లో చైతన్యం తెస్తున్నామన్నారు. ప్రతి గర్భిణి గర్భం దాల్చిన నాటి నుండి ప్రసవం అనంతరం బిడ్డకు రెండేళ్ల పూర్తయ్యే వరకు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు చేసి, బాలింతలతో వచ్చిన వారి చిన్నారులకు అన్నప్రసానం అధికారులతో కలిసి పీడీ వెంకటేశ్వరి, సిడిపిఓ వినతశ్రీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హరిప్రసాద్ రెడ్డి, ఎంఈఓ గుణశేఖర్ రెడ్డి, సిహెచ్ఓలు శ్రీనివాసులు, జ్ఞానశేఖర్, సర్పంచ్ సుబ్రహ్మణ్యం, సూపరువైజర్లు అనురాధ, బిందు మాలతి, నాగరత్నమ్మ, భాగ్యలక్ష్మి, సంగీత, పలువురు అంగన్‌వాడీ టీచర్లు, సచివాలయ మహిళా పోలీసులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మహిళా శిశు సంక్షేమ శాఖా పీడీ వెంకటేశ్వరి

పీజీఆర్ఎస్‌కు 11 ఫిర్యాదులు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ :

చిత్తూరు నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీ ఆర్ఎస్)కు 11 సమస్యలు వచ్చినట్లు నగర కమిషనర్ పి నరసింహ ప్రసాద్ తెలిపారు. సోమవారం నగరపాలక కార్యాల యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. అర్జీలపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. సోమవారం నాటి కార్యక్రమంలో ఇంజనీరింగ్ - 9, ప్లానింగ్ -1, పింఛను ఒక్కొక్కటి చొప్పున మొత్తం 11 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ ఎ ప్రసాద్, ఎంహెచ్వో డా లోకేష్, ఏసీపీ నాగేంద్ర, ఎంఈ వెంకటరామి రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మామిడి కాయలు పండ్లుగా మార్చడానికి

కాల్షియం కార్బైడ్ వాడకం నిషేధం: జేసీ

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి): ప్రజల ఆరోగ్య దృష్ట్యా మామిడి కాయలను పండ్లుగా మార్చడానికి వినియోగించే కాల్షియం కార్బైడ్ అమ్మడం, నిల్వ చేయడం, రవాణా చేయడం చట్టరీత్యా నేరమని, తనిఖీలో పట్టుబడితే సెక్షన్ 44 (ఏ) ప్రకారం 3 సంవత్సరాల జైలు శిక్షతో పాటు వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తామని జాయింట్ కలెక్టర్ జి విద్యాధరి సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. మామిడి కాయలను కోసిన తర్వాత పండుగా మారడానికి సహజంగా వారం రోజులు పడుతుందని, కానీ కోసిన వెంటనే పండ్లుగా మార్చడానికి కాల్షియం కార్బైడ్ రసాయనాన్ని వినియోగించడం వల్ల మామిడి కాయలు రంగు వృద్ధి చెంది మెత్తగా మారుతాయి తప్ప పండు లోపల చక్కెరలు వృద్ధి చెందవని, ఫలితంగా మామిడి కాయలు పండ్లుగా మారినా నాణ్యతగా వుండవన్నారు. కాల్షియం కార్బైడ్ వినియోగించి పండ్లుగా మార్చిన పండ్లు తినడం వల్ల కాల్షియం కార్బైడ్ విడుదల చేసిన ఆరసినిక్ యాసిడ్ రసా య నం వల్ల మనుషులలో కాలేయం, మూత్రపిండాల సమస్యలు, వాంతులు, విరేచనా లు, మత్తుగా ఉండడం, గుండె జబ్బులు, కడుపులో పుండ్లు తదితర సంబంధిత వ్యాధులతో పాటూ కేన్సర్ వచ్చే అవకాశాలు ఉండడం వల్ల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కాల్షియం కార్బైడ్ వాడకాన్ని జిఓఆర్‌టి నెంబరు 288 తేది 19-03-2012 ద్వారా నిషేధించారని పేర్కొన్నారు. కాల్షియం కార్బైడ్ రసాయనాన్ని, వ్యాపారస్తులు, రైతులు, చిరు వ్యాపారస్తులు ఎవ్వరూ పండ్లుగా మార్చడానికి వినియోగించ కూడ దన్నారు. నిషేధిత కాల్షియం కార్బైడ్ వాడినట్లు తెలిసినా, నిల్వచేసినా, రవాణా చేస్తూ పట్టుబడినా చట్టరీత్యా చర్యలు తీసుకోవడంతో పాటు కాల్షియం కార్బైడ్ అక్రమ రవాణా చేసే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. కాల్షియం కార్బైడ్ కు ప్రత్యామ్నాయంగా ఎథిలీన్ గ్యాస్ లేదా ఎత్రెల్ ద్రావణం ఉపయోగించి పండ్లుగా మార్చుకోవచ్చని రైపనింగ్ ఛాంబర్లు ఏర్పాటు చేసుకుని ఎథిలీన్ గ్యాస్ ద్వారా మామిడి కాయలు పండ్లుగా మార్చుకోవడానికి చట్ట ప్రకారం అనుమతి ఉందని, వీటితో అత్యంత నాణ్యమైన పండ్లు లభిస్తాయన్నారు. ఎత్రెల్ ద్రావణం వాడేటప్పుడు కేవలం 100 పిపిఎం (1 మి.లీ 100 లీటర్ల నీటికి చొప్పున) మాత్రమే వినియోగించి పండ్లుగా మార్చాలని అధిక సాంద్రతతో ఎత్రెల్ ద్రావణం వినియోగించడం కూడా ఆరోగ్యానికి హానికరమన్నారు. వ్యాపారులు, చిరు వ్యాపారు లు, రైతుల తప్పనిసరిగా ఎథిలీన్ గ్యాస్ వినియోగించుకోవాలన్నారు. ప్రస్తుతం ఎథిలీన్ చిన్న చిన్న ప్యాకెట్ల రూపంలో ఎన్రైప్ అని లేదా గోల్డ్ రైప్ అని దొరుకుతున్నాయని, ఇది కూడా సురక్షితంగా మామిడి కాయలు పండ్లుగా మార్చడానికి వినియోగించవచ్చన్నారు. వినియోగదారులు సైతం మార్కెట్ లో మామిడి పండ్లను గమనించి తెచ్చుకోవాలని కాల్షియం కార్బైడ్ వాడి పండ్లుగా మార్చితే మామిడి కాయల పై పల్చగా తెల్లటి పొడి లాంటి పదార్థం ఉంటుందని, నీటితో కూడిన మచ్చలు ఉంటాయన్నారు. కాల్షియం కార్బైడ్ వినియోగిస్తే మున్సిపల్ కమిషనర్, ఉద్యాన శాఖాధికారులు లేదా పంచాయతీ సెక్రెటరీ, మార్కెటింగ్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. మార్కెట్, మామిడి యార్డులలో, లారీలకు లోడింగ్ చేసే సమయంలో అధికారులకు తనిఖీ చేసే అధికారంతో పాటు అవసరమైతే ఫుడ్ ఇన్‌స్పెక్టర్ శ్యాంపిల్స్‌లు సేకరించి అందులో నిషేధిత రసాయనాలు నిర్ధారణ అయితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిరుపయోగంగా నుంజర్ల ప్రాజెక్టు ?

• సెంటు భూమికి నీటి సరఫరా చేయలేని పరిస్థితి • ఏళ్ల తరబడి కొనసాగుతున్న నిర్లక్ష్యం • హంద్రీ-నీవా అనుసంధానం ఒక్కటే మార్గం

ప్రజాశక్తి -యాదమరి: 25 ఏళ్ల క్రితం కోట్ల రూపాయల వ్యయంతో సాగునీటి అవసరాల కోసం నిర్మించిన నుంజర్ల ప్రాజెక్టు లక్ష్యం నీరు కారిపోయింది. కోట్లు వెచ్చించినా సెంటు భూమికి నీటిని సరఫరా చేయలేని దుస్థితిలో నేటికీ నిరుపయోగంగా దర్శనమిస్తోంది. అధికారుల నిర్లక్ష్యం పాలకుల వద్ద రైతుల పాలిట శాపంగా మారిన ప్రాజెక్టు పరిస్థితి నానాటికీ దయనీయంగా మారుతోంది. 105 ఎన్‌సిఎఫ్‌టీల నీటి సామర్థ్యంతో సుమారు 350 ఎకరాల భూములకు సాగునీటి సౌకర్యం అందించాలనే లక్ష్యంతో యాదమరి మండలం భూమి రెడ్డి పల్లి గ్రామ పంచాయతీ పరిధిలో రెండు కొండల నడుమ ప్రాజెక్టును నిర్మించారు. ప్రాజెక్టు నిర్మించినా లక్ష్యం నెరవేరలేదు.

ప్రాజెక్టు వ్యయం రూపాయలు రెండు కోట్లకు పైగానే కుడి ఎడమ కాలువలకు మరో రూ 60 లక్షలు వెరసి ప్రాజెక్టు ఇంత భారీ వ్యయంతో రైతులకు సాగునీరు అందించాలనే ఆశయంతో 2000 సంవత్సరంలో నిర్మించిన ఇది నేటికీ తన లక్ష్యాన్ని చేరుకోలేదు. ప్రాజెక్టు నిర్మాణంలో సాంకేతిక లోపాలు ఉండడంతో గడిచిన 25 ఏళ్లుగా సెంటు భూమికి సాగునీరు అందించిన పాపాన పోలేదు. 15 ఎంసిఎ సామర్థ్యంతో నిర్మించిన ఈ ప్రాజెక్టును రెండు వైపులా ఏర్పాటు చేసి కాలువలు తవ్వారు. ఈ కాలువల ద్వారా సుమారు 350 హెక్టార్ల మేర సాగు నీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మేరకు రూపాయలు 60 లక్షలతో కాలువను తవ్వారు. మధ్య మధ్యలో సిమెంటుతోనూ కాలువలు నిర్మించారు. కానీ ప్రస్తుతం పరిస్థితి ప్రాజెక్టు నుంచి ఏడు కిలోమీటర్ల మేర ఈ కాలువ ద్వారా సుమారు 150 హెక్టార్లలకు సాగునీరు అందించాలని వున్నారు. ఇంత చేసినా నేటికీ ఒక్క సెంటు భూమికి సాగునీరు ఇచ్చిన పాపాన పోలేదు. కారణం ప్రాజెక్టు తూముల కంటే ఎత్తులో నిర్మించడం.. దీంతో నీరు సరిగా వెళ్లలేదు. ఈ వ్యవహారం వల్లే క్రమంగా శిథిలావస్థకు చేరాయి. ప్రస్తుతం చాలా ప్రాంతాల్లో కనిపించని పరిస్థితి నెలకొంది. ప్రాజెక్టు నిర్మించి అధికారులు నీటిని పొలాలకు తీసుకురావడంపై ఏమాత్రం దృష్టి సారించడం లేదు. దీంతో గడిచిన 25 ఏళ్లుగా కొండలు నుంచి వచ్చే నీరంతా ప్రాజెక్టులో నిల్వ ఉంటుంది. వేసవిలో నీటి పరిమాణం తగ్గడం కారణంగా వర్షాకాలంలో మళ్లీ పెరగడంతో రైతాంగానికి ఏ మాత్రం ఉపయోగపడని విధంగా తయారయింది. దీనికి తోడు వర్షాలు తగ్గిపోవడంతో ప్రాజెక్టు నిండిన సందర్భాలు తక్కువ.

నీవా నది కనుమరుగు!

భౌగోళికంగా మండలంలో మధ్యలో విస్తరించిన నీవా నది సాగునీటి పరంగా రైతాంగానికి ఎంతో ప్రధానమైంది. నదిలో నీటి ప్రవాహం ఎన్ని

భూమి రెడ్డి పల్లి లోని నుంజర్ల ప్రాజెక్టు

రోజులైనా మండలంలో భూగర్భజలాలు విస్తారంగా ఉండి రైతులకు ఎలాంటి కష్టం లేకుండా సాగింది. అయితే రెండు కొండల నడుమ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టడంతో నదిలోకి నీటిని పంపడం కష్టతరమైంది. వచ్చే నీరు భూమి రెడ్డి పల్లి పంచాయతీ పరిధిలో మూడు చెరువుల మీదుగా నదిలోకి చేరి అక్కడ నుంచి చిత్తూరు వరకు ప్రవహిస్తుంది. ప్రాజెక్టు నిర్మాణం తర్వాత నీటి ప్రవాహం ఆగిపోయింది . ఇదే సమయంలో వాగులో ఇసుక తవ్వకాలు భారీగా జరిగాయి. గడిచిన దశాబ్ద కాలంలో నది లోని ఇసుక పూర్తిగా దోచేశారు. చాలా చోట్ల నీవా నది వాగు నామరూపాలు లేకుండా పోయింది. ప్రస్తుతం పరివాహక ప్రాంతాల మీద పడ్డారు. దీంతో మండలంలో నీటి ఎద్దడి ప్రారంభమైంది. ఇప్పుడు కురుస్తున్న వర్షాలతో భూగర్భజలాలు పెరిగిన వేసవి కాలం రావడంతో నీరు వెంటనే అడుగంటి పోతున్నాయి. భూగర్భ జలాలు వందల అడుగులకు వెళ్లిపోయింది. ప్రతి ఏటా వర్షాభావ పరిస్థితుల కారణంగా చెరువుల్లోకి వచ్చే నీటి పరిమాణం తగ్గిపోతుంది దీంతో ఆ ప్రాంతంలో భూగర్భ జలాలు పెరిగే పరిస్థితి లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

శిథిలావస్థలో నుంజర్ల ప్రాజెక్టు సప్లై ఛానల్

హంద్రీ-నీవా తోనే బతుకు!

నుంజర్ల ప్రాజెక్టు నిరుపయోగంగా మారడం, నీవా నది రూపురేఖలు కోల్పోవడం, మండలంలో సాగు, తాగునీటి పరిస్థితి ప్రమాదకర స్థాయిలో వుంది. వర్షాభావ పరిస్థితులు ఇలాగే కొనసాగితే తాగునీటి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి. ఈ పరిస్థితి మారాలంటే ఒకటే మార్గం మండలానికి హంద్రీ-నీవా కాలువను యాదమరి మండలానికి పొడిగించడం, బంగారుపాళ్యం మండలం వరకు హంద్రీ-నీవా కాలువ నిర్మించారు. ఈ కాలువను ఇంకా పొడిగించి మండల పరిధిలోని గూటాల వంక, ప్రాజెక్టుకు కలపడం ఒకటే మార్గమని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఈ రెండు మేజర్ ప్రాజెక్టుల్లోకి నీరు చేరితే వాటి ద్వారా దిగువ మండలం వ్యాప్తంగా నీటి నిల్వలు పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఈ దిశగా సాగునీటి పారుదల శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పిచ్చి మొక్కలతో నిండిన నుంజర్ల ప్రాజెక్ట్ సప్లై ఛానల్

ప్రభుత్వ పాఠశాలలోనే మెరుగైన విద్య

ప్రజాశక్తి- గుడిపాల: ప్రభుత్వ పాఠశాలలోనే మెరుగైన విద్యను అందిస్తున్నారని నరహరిపేట జెడ్పీ హైస్కూల్ విద్యా కమిటీ ఛైర్మన్ టి ఆర్ ఢిల్లీ బాయ్ అన్నారు. ప్రతి తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో తమ పిల్లలను చేర్పించాలని సోమవారం మండలంలోని రామభద్రాపురం పంచా యతీలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల ,కళాశాలలో ప్రభుత్వం అనేక సౌకర్యాలు చేయడం తో పాటు విద్యార్థుల భవిష్యత్తుకు పెద్దపీట వేస్తుం దన్నారు. తల్లిదండ్రులు విద్యార్థుల భవిష్యత్తును ఆలోచించి తగిన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీధర్, వెంకటేశులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యపై అవగాహన కల్పిస్తున్న విద్యా కమిటీ ఛైర్మన్

చెత్త సేకరణ కేంద్రంలో పారిశుధ్యం

• స్పందించిన పంచాయతీ అధికారులు
• 'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి- యాదమరి: 'చెత్త నుండి సంపద ఏది..?' అనే శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో సోమవారం వార్త ప్రచురితమైంది. స్పందించిన గ్రామ పంచాయతీ సర్పంచ్ ఏ సుబ్బారెడ్డి, పంచాయతీ కార్యదర్శి సుధాకర్ ఆధ్వర్యంలో కృష్ణంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని నిరుపయోగంగా ఉన్న వాడుకలో లేని చెత్త నుండి సంపద తయారు చేసే కేంద్రంలో అపరిశుభ్రంగా ఉన్న డంపింగ్ యార్డ్‌లో జెసిబిలతో చెత్తను తొలగించి శుభ్రం చేశారు. డంపింగ్ యార్డ్ కు తాగునీటి వసతి కోసం నూతన పైపులైన్ ఏర్పాటు చేశారు. విద్యుత్ సౌకర్యం కోసం విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి త్వరలో విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేస్తామని తెలిపారు. శిథిలా వస్థలో ఉన్న తొట్టెలను శుభ్రపరిచి వాడుకలోకి తీసుకు వచ్చేందుకు అన్ని రకాల చర్యలు తీసు కుంటామని పంచాయతీ కార్యదర్శి సుధాకర్ తెలిపారు. గ్రామపంచాయతీ పరిధిలోని చెత్తను డంపింగ్ యార్డుకు తరలించి తడి చెత్త, పొడి చెత్త వేరుచేసి వాడుకలో తీసుకొచ్చే విధంగా పంచాయతీ పరిధి లోని గ్రీన్ అంబా సిడర్లకు ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. చెత్త కేంద్రం చుట్టూ త్వరలోనే ఫెన్సింగ్ ఏర్పాటు చేసి చెత్త కేంద్రాన్ని అందు బాటులోకి తీసుకొస్తామని తెలిపారు.

కృష్ణంపల్లి డంపింగ్ యార్డును శుభ్రం చేయిస్తున్న పంచాయతీ కార్యదర్శి

నీటి వసతి కోసం పైపులైను ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ఏకగ్రీవంగా ఎన్నికైన టిడిపి నాయకులను సన్మానిస్తున్న దృశ్యం

హేమసుందరం ఎన్నిక ఏకగ్రీవం

ప్రజాశక్తి-పలమనేరు:

ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఆదేశాల మేరకు కొలమాసనపల్లి టిడిపి కార్యవర్గాన్ని మండల నాయకుల సమక్షంలో సోమవారం ఎన్నుకున్నారు. కొలమాసనపల్లి పంచాయ తీ అధ్యక్షుడిగా హేమ సుందరం (బాబు)ను, కార్యదర్శిగా బాల చంద్రారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తెలుగు యువత అధ్యక్షులుగా వెంకటేష్‌కు అవకాశం కల్పించారు. ఈ కొత్త కమిటీలో పార్టీ కోసం పని చేసిన 25 మందికి చోటు కల్పించారు.

సిద్ధయ్య దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ప్రధానోపాధ్యాయునికి సత్కారం

ప్రజాశక్తి -వెదురుకుప్పం:

మండలంలోని పచ్చికాపల్లం హైస్కూల్ ప్లస్ ప్రిన్సిపాల్, ప్రధానోపాధ్యాయులు పోతుగంటి సిద్దయ్య సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా పలువురు ఆయనను సత్కరించారు. ఈ కార్యక్రమానికి పలువురు నాయకులు, సహోపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వెదురుకుప్పం క్లస్టర్ ఇన్‌ఛార్జి, టిడిపి మాజీ మండల అధ్యక్షులు మాజీ ఎంపీటీసీ మోహన్ మురళి, మాజీ సర్పంచ్ రాజారెడ్డి ఆ దంపతులకు శాలువా కప్పి సన్మానం చేశారు. వివిధ పాఠశాలల్లో పనిచేసిన ఆయన పచ్చికాపల్లం ప్రధానోపాధ్యా యులుగా రిటైర్మెంట్ పొందుతున్నారు. ఆయన సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పచ్చికాపల్లం హైస్కూల్ ఛైర్మన్ చెంగలరాయులు, టిడిపి మండల ఎస్‌సి అధ్యక్షులు వరప్రసాద్, చెంచుగుడి బూత్ కన్వీనర్ చిరంజీవి నాయుడు, తిరుమలయ్యపల్లి బూత్ కన్వీనర్ శంకరయ్య, విక్రమ్ రెడ్డి, మారేపల్లి సర్పంచ్ అన్బు రాశి అశోక్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

ఘనంగా జెడ్‌పి ఉన్నత పాఠశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి-తవణంపల్లి:

తవణంపల్లి మండలం అరగొండ జిల్లా పరిషత్ హైస్కూల్ ప్లస్ పాఠశాల వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అరగొండ రాజేశ్వరి, విశిష్ట అతిథిగా భారతి మధు కుమార్, ఠశాలవిద్యాకమిటీ ఛైర్మన్ భాగ్య రాణి హాజరయ్యారు. భారతి, మధు కుమార్ జెడ్పీ నిధులతో పాఠశాలకు పూర్తి రంగులతో నిండుదనం తెచ్చారని ప్రధానోపాధ్యాయులు ఏ మోహన్ రెడ్డి కొనియాడారు. లలిత శ్రీ పాఠశాల వార్షిక నివేదికను చదివి వినిపించారు. రాజేశ్వరి పాఠశాలలో అన్ని తరగతుల లో మొదట, ద్వితీయ శ్రేణులలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. నగదు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రచనలతో విద్యార్థుల అభివృద్ధి: సర్పంచి

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: రచనలతో విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధి చెందుతారని సర్పంచ్ కొప్పాలపల్లి మురళి అన్నారు. సోమవారం మండలంలోని మంగళపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళ విద్యావాణి 35 వ సంచిక ఆవిష్కరణ ప్రధానోపాధ్యాయులు రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మాస పత్రికలో విద్యార్థులు తనకు నచ్చిన ఉపాధ్యాయుల గురించి ,పాఠశాలలో తన పూర్వ అనుభవాల గురించి వ్యాసాలతో ప్రత్యేక సంచికను తయారు చేశారని విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి , రచన శక్తిని పెంపొందించడానికి ఈ మాసపత్రిక ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ మ్యాథ్స్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు, జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు, గణిత అవధాని, మంగళ విద్యావాణి మాసపత్రిక సంపాదకులు హెచ్ అరుణ శివప్రసాద్ మాట్లాడుతూ 2018 సెప్టెంబర్ నెలలో ప్రారంభించిన ఈ మాస పత్రిక ప్రస్తుతం 35 వ సంచికను విడుదల చేస్తున్నామని రాష్ట్ర పాఠశాల చరిత్రలో ఒక పుస్తకాన్ని విద్యార్థులను రచయితలుగా చేసి వారి రచనలను అచ్చువేసి ఉచితంగా అందించే ఏకైక మాసపత్రిక ఈ మంగళ విద్యా వాణి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సంజీవి, పిల్లారప్ప ,సంపంగి ,మోహన్ రెడ్డి ధన శేఖర్ ,భారతి, శ్రీనివాసులు ప్రసంగించి ఈ మాస పత్రికకు ఆధ్యుడైన అరుణ శివప్రసాద్‌ను సత్కరించారు. మాస పత్రికకు దాతలుగా నలగాంపల్లికి చెందిన ధరణి ప్రసాద్, రిటైర్డ్ డిగ్రీ కాలేజీ లెక్చరర్ కుసుమకుమారిలు వ్యవహరించారు.

మంగళ విద్యా వాణి సంచికను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

1 నుండి ఉచిత వేసవి శిక్షణా తరగతులు

ప్రజాశక్తి- గంగవరం: తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో మే నెల ఒకటో తేదీ నుండి గంగవరం సాయి గార్డెన్ సిటీ లోని కళామందిరంలో ఉచిత వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్ష కార్యదర్శులు పి తులసినాథం నాయుడు, పుష్ప తెలిపారు. తెలుగు భాషా పరిజ్ఞానాన్ని పెంపొందించడంతోపాటు రోజుకో పద్యం నేర్పిస్తామన్నారు. నీతి కథల ద్వారా విలువలు పెంపొందిస్తామన్నారు. ఆసక్తి గల తల్లిదండ్రులు తమ పిల్లల పేర్లను ఈనెల 26వ తేదీ లోపు 9553429770 నెంబర్ కు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలన్నారు. పిల్లలు రెండవ తరగతి నుండి ఏడవ తరగతి లోపు వారై ఉండాలని ఆ సంస్థ అధ్యక్ష కార్యదర్శులు తులసినాథం నాయుడు పుష్ప పేర్కొన్నారు.

మాట్లాడుతున్న తులసినాథం నాయుడు

శునకాల బెడద పరిష్కారమయ్యేనా?

ప్రజాశక్తి- ఎస్ఆర్‌పురం:

మండల కేంద్రంతో పాటూ పుల్లూరు క్రాస్, కొత్తపల్లి మిట్టతో పాటు పలు గ్రామాల్లో శునకాలు బెంబేలెత్తిస్తున్నాయి. కోళ్ల వ్యర్థాలను చికెన్ దుకాణాల యజమానులు ఎక్కడ పడితే అక్కడ పడవేస్తుండడంతో వాటిని తినేందుకు శునకాలు గుంపులుగుంపులుగా తిరుగుతున్నాయి. అటుగా వెళ్లే మనుషులపై అవి తిరగబడి తరుముకుంటున్నాయని ప్రజలు వాపోతున్నారు. వారం క్రితం కాపు కండ్రిగ వద్ద శునకాలు ఎనిమిది మందిపై స్వైర విహారం చేశాయి. కొన్ని గ్రామాల్లో పశువులు, దూడలపైర మేకలు, గొర్రెలపై శునకాలు దాడిచేసి చంపేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. వీటి నియంత్రణకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

భవనం పూర్తయ్యేదెన్నడో?

ప్రజాశక్తి- సోమల:

మండలంలోని సూరయ్యగాలిపల్లె ఉన్నత పాఠశాలలో 'నాడు– నేడు కింద చేపట్టిన నూతన భవనాల నిర్మాణం అర్థాంతరంగా ఆగింది. భవనాల నిర్మాణం పిల్లర్ల వరకే పరిమితమైంది. గత ప్రభుత్వ హయాంలో గుత్తేదారులకు చేసిన పనులకు బిల్లులు మంజూరు కాకపోవడంతో వారు భవనాల నిర్మాణాలను మధ్యలోనే ఆపివేశారు. దీంతో నిర్మాణ పనులు ఆగిపోయాయి. ఈ ప్రభుత్వ హయాంలోనైనా స్పందించి భవనాలను పూర్తి చేసి విద్యార్థులకు భవనాలను ఉపయోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరు తున్నారు.

వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

'ఫ్యామిలీ డాక్టర్'ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - యాదమరి: 'ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం'ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని యాదమరి వైద్యాధికారి డాక్టర్ అనిల్ కుమార్ నాయక్ పిలుపు నిచ్చారు. యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో కొటాల గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం, 104 సంచార వైద్య సేవల కార్యక్రమంలో పాల్గొన్న వైద్యాధికారి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఎలాంటి ఖర్చు లేకుండా చిన్న చిన్న జబ్బులకు వారి గ్రామంలోనే వైద్య పరీక్షలు చేసి చికిత్సలు అందించాలనే సదుద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ప్రతి నెల నాలుగవ సోమవారం మీ గ్రామానికి ఈ వాహనంతో పాటు వైద్యాధికారి వైద్య బృందం హాజరై మీకు అవసరమైన వైద్య సేవలను ఉచితంగా అందిస్తామని ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టరు సూచించారు. బిపి, షుగర్ వ్యాధులకు పరీక్షలు నిర్వహించి నెలకు సరిపడా మాత్రలు ఉచితంగా అందిస్తారన్నారు. గర్భిణులు క్రమం తప్పకుండా ప్రతి నెలా ఈ 104 వాహనం వద్దకు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకొని అవసరమైన మందులు పొందాలని సూచించారు. గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రిలోనే కాన్పులు చేసుకోవాలని సూచించారు. దానివల్ల తల్లి బిడ్డ సురక్షితంగా ఉంటారని డాక్టర్ అనిల్ కుమార్ నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ లక్ష్మీనారాయణ , సూపరువైజర్స్ , ఏఎన్ఎమ్స్, ఆశా వర్కర్స్ పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన వసంతోత్సవం

ప్రజాశక్తి -కార్వేటినగరం:

కార్వేటినగరం ప్రసిద్ధి రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వసంతోత్సవంలో భాగంగా మూడవ రోజు సోమవారం వైభవంగా ముగిసింది. వేద పండితులు వేకువ జామున సుప్రభాత సేవతో స్వామివార్ల మేల్కొలిపి శుద్ధి. తోమాలసేవ, అర్చన, కొలువు వంటి నిత్యకైంకర్యాలను నిర్వహించారు. వంసతోత్సవాలను పురస్కరించుకు మధ్యాహ్నం రెండు గంటలకు రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామితో పాటు కోదండరామ స్వామి వారు ఉత్సవ మూర్తులకు పాలు, పెరుగు, చందనం, పసుపు, తేనే, నారికేళి, వంటి సుగంధ జలాలతో వైభవంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. అదే విధంగా సాయంత్రం ఆరు గంటలకు స్వామివారికి వేద పండితులు వేద మంత్రాలతో ఆస్థానం నిర్వహించారు. రాత్రి ఏడు గంటలకు రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి వారు. సీతాసమేత కోదండరాములు స్వామివారులను పట్టు వస్త్ర సుగంధ పుష్పాలు విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి తిరుచ్చి వాహనాలపై కొలువు దీర్చారు. మంగళ వాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. రాత్రి 9 గంటలకు స్వామిని ఏకాంతసేవతో సేద తీర్చారు. దీంతో వసంతోత్సవాలు వైభవంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో నగరత్న, సూపరింటెండెంట్ మునిశేఖర్, ఆలయ అధికారి సురేష్ కుమార్, అర్చకులు రమేష్, శబరి గోపాలాచారి, షరాబ్ బాబుసురేష్, టీటీడీ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి -గుడిపాల: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన గుడిపాల మండలంలోని గొల్లమడుగు వద్ద ఉన్న లక్ష్మీ నరసింహ కాలేజ్ ఆవరణలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు కథనం మేరకు గుర్తు తెలియని వ్యక్తి మానసిక పరిస్థితి బాగోలేదని దీంతో అక్కడ విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని తెలిపారు. ఉన్నట్లుండి స్పృహ తప్పిపోయి పడిపోయాడని దీంతో అతను మృతి చెందారని వారు తెలిపారు. అతని వయసు సుమారు 50 సంవత్సరాలు ఉండవచ్చని తెలిపారు.

రేపటి నుండి టిడిపి సంస్థాగత ఎన్నికలు

ప్రజాశక్తి - బైరెడ్డిపల్లి: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఈ నెల 23వ తేదీ నుండి టిడిపి సంస్థాగత ఎన్నికలు నిర్వహించనున్నట్లు పంచాయతీలోని ముఖ్యమైన నాయకులు, కార్యకర్తలు అందుబాటులో ఉండాలని మాజీ జెడ్‌పిటిసి రాధా కిషోర్ , టిడిపి మండల ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం సోమవారం పేర్కొన్నారు. 23వ తేదీ బుధవారం 9 గంటలకు బెలుపల్లి పంచాయతీ, 10 గంటలకు కమ్మనపల్లి పంచాయతీలలో ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. 24వ తేదీ గురువారం ఉదయం 9 గంటలకు చప్పిడిపల్లి గ్రామపంచాయతీ, 10 గంటలకు నెల్లిపట్ల పంచాయతీ, 11 గంటలకు ధర్మపురి పంచాయతీలలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. 25వ తేదీ శుక్రవారం ఉదయం 8 గంటలకు దేవదొడ్డి పంచాయతీ, 9 గంటలకు తీర్థం పంచాయతీ, 10 గంటలకు గడ్డూరు పంచాయతీ, 11 గంటలకు ఎం కొత్తూరు పంచాయతీ, 12 గంటలకు దాసర్లపల్లి పంచాయతీలలో నిర్వహిస్తామన్నారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు వెంగం వారి పల్లి పంచాయతీ, 4 గంటలకు గౌనితిమ్మేపల్లి పంచాయతీ, 5 గంటలకు కడపనత్తం పంచాయతీలలో నిర్వహిస్తా మన్నారు. 26 వ తేదీ శనివారం ఉదయం 9 గంటలకు ఆలపల్లి పంచాయతీ, 10.30 గంటలకు గొల్ల చీమలపల్లి పంచాయతీ, 11.30 గంటలకు లక్కనపల్లి పంచాయతీ, 12.30 గంటలకు పెద్ద చల్లారగుంట పంచాయతీలలో నిర్వహిస్తామని తెలిపారు. 27న 8 గంటలకు పాతపేట పంచాయతీ, 9 గంటలకు పాతూరు నత్తం పంచాయతీ ,10.30 గంటలకు గంగినయనిపల్లి పంచాయతీలలో నిర్వహిస్తామన్నారు. 27న సాయంత్రం 5 గంటలకు బైరెడ్డిపల్లి పంచాయతీలో ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు.

ఉర్దూ స్కూల్‌ను ప్రైమరీలో విలీనం చేయొద్దు

ప్రజాశక్తి - రేణిగుంట:

రేణిగుంటలో ఉండే ఉర్దూ స్కూల్ను ప్రైమరీ స్కూల్లో విలీనం చేయొద్దని సోమవారం ముస్లిం సంఘాల నేతలు ఎంపీడీవో విష్ణు చిరంజీవికి వినతిపత్రం ఇచ్చారు. ముస్లిం మైనార్టీ నాయకులు జీకే మునీర్ మాట్లాడుతూ పట్టణంలోని ఉర్దూ స్కూల్లో చదువుతున్న విద్యార్థులను మోడల్ ఇంగ్లీష్ మీడియం ప్రైమరీ స్కూలుకు బదలాయిస్తున్నారని, దీనివలన విద్యార్థుల తల్లితండ్రులు మానసిక క్షోభకు గురవుతారన్నారు. ప్రస్తుతం ఉన్న ఉర్దూ స్కూల్‌ను ముస్లింలు అందరూ పోరాడి సాధించుకున్నారని తెలిపారు. వేరే పాఠశాలకు మార్చడం వల్ల విద్యార్థుల భవిష్యత్తు పూర్తిగా దెబ్బతింటుందన్నారు. జాకీర్ హుస్సేన్, రఫీఉల్లా, సలీం తదితరులు పాల్గొన్నారు.

భూ సేకరణ పూర్తి చేయాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్:

వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టర్, సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, సంబంధిత అధికారులతో కలిసి వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి పనులలో భాగమైన పలు ఇండస్ట్రియల్ కారిడార్‌కు సంబంధించిన భూసేకరణ పనులు, రోడ్లు తదితర అంశాలపై విసిఐసి, రెవెన్యూ, ఏపీఐఐసీ , ఆర్ అండ్ బి శాఖల వారితో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయ్ భరత్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ ఈ మధుసూదన్ రావు, సంబంధిత మండలాల తాసిల్దారు , తదితరులు పాల్గొన్నారు

క్రీడాకారులకు అభినందన

ప్రజాశక్తి - తిరుపతి టౌన్:

జాతీయ స్థాయిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారు నిర్వహించిన రెజ్లింగ్ హాకీ టోర్నమెంట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన తిరుపతి ఎం.జి.ఎం పాఠశాలలో చదువుతున్న టీ ప్రణీత ఏడవ తరగతి, జ్యోతిర్మయి, మహాలక్ష్మి 8 వ తరగతి చదువుతున్న విద్యార్థులను జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ కేవిఎన్ కుమార్, పాఠశాల హెచ్‌ఎం ముని, శారద , పి టి ప్రసన్న కుమారి పాల్గొన్నారు.

'మండే' కాలం.. జర జాగ్రత్త..!

సుదీర్ఘ ప్రయాణం యమ 'డేంజర్'

ప్రజాశక్తి - తిరుమల

మండు వేసవిలో సొంత వాహనాల్లో సుదీర్ఘ ప్రయాణం 'డేంజర్' అనే చెప్పాలి. అందునా తిరుమలకు అంటే మరింత జాగ్రత్తలు తప్పనిసరి. తాజాగా వారం రోజుల్లోనే తిరుమలకు వస్తున్న రెండు కార్లు దగ్ధం అయ్యాయి. వాహనాల్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం జరగలేదు. కానీ రెండు కార్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. కార్లు దగ్ధం కావడానికి కారణాలు ఏంటని నిపుణులను సంప్రదించగా తిరుమల ఘాట్‌రోడ్డులో అప్పటికే 500 కిలోమీటర్ల పాటు ప్రయాణించిన తరువాత అధిక వేడి వల్ల మంటలు అంటుకుంటాయి. కొన్ని మెకానిక్ సమస్యలు, పర్యావరణ పరిస్థితులు కారణం అవుతాయి.

సుదీర్ఘ ప్రయాణం

- 500 కిమీ లాంటి ప్రయాణం తర్వాత ఇంజిన్ అప్పటికే వేడిగా ఉంటూ ఒత్తిడిలో ఉంటుంది.
- తక్షణమే తిరుమల ఘాట్ పైకెక్కడం ప్రారంభిస్తే, ఇంజిన్, ట్రాన్స్‌మిషన్‌కు అధిక వేడి వస్తుంది.

కొండలు, వంకర రోడ్లు

- ఘాట్ రోడ్లకు అధిక ఇంజిన్ శక్తి అవసరం.
- డ్రైవర్లు ఎక్కువగా తక్కువ గేర్లను ఉపయోగిస్తారు, ఆర్‌పిఎం పెరిగి వేడి పెరుగుతుంది.
- దిగే సమయంలో తరచుగా బ్రేకింగ్ చేయడం వల్ల బ్రేక్ సిస్టమ్ వేడిగా మారుతుంది.

అధిక లోడుతో వెళ్ళే వాహనాలు

- తీర్థయాత్రలలో బరువు బ్యాగులు, ఎక్కువ మందిని తీసుకెళ్లడం సాధారణం.
- ఇది ఇంజిన్‌పై ఒత్తిడిని పెంచి వేడి సమస్యలకు దారితీస్తుంది.

పూర్ మెయింటెన్ వాహనాలు

- పాత వాహనాలు లేదా సరిగా సర్వీస్ చేయని వాహనాలలో

కూలంట్ లీక్‌లు లేదా తక్కువ స్థాయి కూలంట్

- పాడైన రేడియేటర్లు లేదా ఫ్యాన్లు
- ఫాల్టీ థర్మోస్టాట్లు
- పాడిసిపోయిన ఇంజిన్ ఆయిల్ ..

ఇంధన లేదా ఎలక్ట్రికల్ సమస్యలు

- ఇంధన పైపుల లీక్‌లు లేదా షార్ట్ సర్క్యూట్లు తీవ్రమైన వేడి ఉన్నప్పుడు మంటలు రగిలే ప్రమాదం ఉంది.
- దీర్ఘ ప్రయాణం తర్వాత ఉష్ణోగ్రతలు, వైబ్రేషన్లు సమస్యలను పెంచుతాయి.

ఘాట్ ఎక్కిన వెంటనే వాహనాన్ని ఆపడం

- కొంతమంది డ్రైవర్లు ఘాట్ ఎక్కిన వెంటనే వాహనాన్ని ఆపి ఇంజిన్ ఆఫ్ చేస్తారు.
- దీని వలన ఫ్యాన్ పని చేయదు, వేడి బయటకు వెళ్లదు, ఫలితంగా హీట్ సోక్ జరిగి మంటలు రావచ్చు.

భద్రతా సూచనలు

- యాత్రకు బయలుదేరే ముందు బండిని సర్వీసింగ్ చేయించండి.
- ఇంజన్ ఆయిల్, కూలెంట్ ఆయిల్, బ్రేక్ ఆయిల్, ఏసీ ఆయిల్ తనిఖీ చేయించండి.
- రేడియేటర్ లీకేజీ తనిఖీ చేయడం .
- ఫ్యాన్ బెల్ట్ సరిచూసుకోవడం
- బ్యాటరీలో డిస్టిల్ వాటర్ తనిఖీ చేసుకోవడం, వైర్ల చుట్టూ చేరిన తుప్పు కడిగించుకోవడం.
- డ్రైవర్ ప్రతి రెండు గంటలకి ఒకసారి వాహనం ఆపి అయిదు నిమిషాల పాటు నడక చేయడం, స్వల్ప వ్యాయామం చేయడం, బాగా మంచినీరు తీసుకోవడం, టి మరియు అల్పాహారం సేవించడం చేయాలి..
- సెల్ ఫోన్ మాట్లాడడానికి దూరంగా ఉండాలి.
- వాహన డాష్‌బోర్డు మీద థర్మామీటర్, ఆయిల్ గేజ్ మీటర్ పరిశీలిస్తూ ఉండండి, ఏవైనా ఎర్ర బ్లింకర్ కనపడగానే, బండి ఆపి తనిఖీ చేసుకోవాలి.
- ఘాట్ ఎక్కే ముందు కనీసం 30 నిమిషాలు వాహనాన్ని విశ్రాంతి ఇవ్వండి.
- ఎక్కే సమయంలో ఏసీ ఆఫ్ చేయండి.
- కూలంట్, ఇంజిన్ ఆయిల్, బ్రేకులు బాగున్నాయో లేదో ముందే తనిఖీ చేయండి.
- బండి దిగే సమయంలో ఎక్కువగా బ్రేక్ వాడకుండా, ఇంజిన్ బ్రేకింగ్ వాడండి.

రోడ్డుపైనే దుకాణాలు

- స్పందించని అధికారులు
- నిత్యం రద్దీతో వాహనదారులకు ఇక్కట్లు

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: బంగారుపాళెం మండల కేంద్రంలో చెన్నై –బెంగళూరు జాతీయ రహదారికి ఇరువైపులా దుకాణదారులు రహదారిని ఆక్రమిస్తున్నారు. దీంతో నిత్య రద్దీగా వుండే ప్రాంతాలలో నిత్యం రద్దీగా వుండడంతో వాహన దారులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించక పోవడంతో దుకాణ దారులు రోడ్డును పూర్తిగా ఆక్రమిస్తున్నారు. ఈ కారణంగా ఇటు ప్రజలకు, వాహనదారులు పడరాన్ని పాట్లు పడుతున్నారు. వెడల్పు దాదాపు 60 అడుగులు ఉండాల్సిన రోడ్డు 30 అడుగులకు కుంచించుకుపోయింది. నిత్యం రద్దీగా ఉండే మండల కేంద్రంలో రహదారుల్లో దుకాణదారుల వల్ల ఇబ్బందులు తప్పడం లేదన స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్పందించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుండడంతో దుకాణదారులు ఇష్టా రాజ్యంగా తయారవుతున్నారు. ప్రతి దుకాణ దారులు 10 నుంచి 15 అడుగులు జాతీయ రహదారి ఆక్రమించుకుంటూ ముందుకు చొరబడి రావడంతో రహదారి గల్లంతయ్యే ప్రమాదం వుందని ఇకనైనా సంబంధిత అధికారులు పర్యవేక్షించి రహదారిని కాపాడాల్సిన బాధ్యత ఉందని ప్రజలు వాహన దారులు మొరపెట్టుకుంటున్నారు

రోడ్డుపై దుకాణాలు ఏర్పాటు చేయడంతో ఇబ్బందిపడుతున్న వాహన దారులు